క్లుప్తంగా

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు

తహసీల్దార్‌కు మెదక్‌పల్లి గ్రామస్తుల ఫిర్యాదు

తలకొండపల్లి: అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మెదక్‌పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం తలకొండపల్లి తహసీల్దార్‌కు కృష్ణకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని మెదక్‌పల్లి గ్రామంలోని 123 సర్వే నంబర్ భూమిలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపి రాత్రివేళల్లో లారీల్లో రవాణా చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. కొంతమంది బడా నాయకుల మద్దతుతో ఈ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా మట్టి తవ్వకాలు ఆపాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

ఇబ్రహీంపట్నం రూరల్: శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలు ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామంలో ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నర్సరీల పరిశీలన

ఆమనగల్లు: మాడ్గుల మండలంలోని నర్సాయిపల్లి, గుడితండా, కొత్రగానితండాల్లో బుధవారం ఎంపీడీఓ రాఘవులు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వన నర్సరీలను వారు పరిశీలించారు. హరితహారం కార్యక్రమం వరకు మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బది, ఈజీఎస్ సిబ్బది పాల్గొన్నారు.

నేడు అఖిలపక్ష నేతల సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండాలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన మైనింగ్ విషయమై గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు స్థానిక నాయకులు పారేశయాదవ్, రమేశ్‌నాయక్, గోపినాయక్, రవిరాథోడ్ తదితరులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరుకాగలరని.. అక్రమ మైనింగ్‌ను నిలిపివేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించడం జరుగుతుందని వారు తెలిపారు.

ఆడపడుచులకు అండగా ఉంటాం

ఆమనగల్లు: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో వివాహం చేసుకోబోయే ఆడపడుచులకు పెళ్లికానుక అందించి అండగా ఉంటామని శెట్టిపల్లి సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, టీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. శెట్టిపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యం దంపతులు గ్రామంలో వివాహం చేసుకోబేయే అమ్మాయిలకు రూ.10116 లను పెళ్లి కానుకగా అందిస్తున్నారు. అందులో భాగంగా గ్రామానికి చెందిన ఈదమ్మ, మల్లయ్య దంపతుల కుమార్తె రాణి వివాహం సందర్భంగా బుధవారం ఎగిరిశెట్టి సత్యం రూ.10116 అందించారు. ఇప్పటివరకు 57 మంది అమ్మాయిల వివాహానికి పెళ్లి కానుక అందించామని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ప్రజలకు అండగా ఉంటామని సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటయ్య, స్థానిక నాయకులు యాదయ్య, నర్సింహా, పర్వతాలు, మహేశ్, పరశురాములు, జంగయ్య, శివ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరండి

తలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అనిల్ ఆధ్వర్యంలో ఇంటింటికి ఆయుష్మాన్ భారత్ పథక ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకొని పథకం గురించి వివరించారు. తెల్ల రేషన్ కార్డున్న వారందరూ అర్హులని అన్నారు. పథకంలో చేరిన 0 నుంచి 80 సంవత్సరాలున్న వారందరికి ఉచితంగా రూ.5 లక్షల వరకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం చేయబడుతుందని చెప్పారు. అర్హులు పథకంలో చేరాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: మాడ్గుల మండల కేంద్రానికి చెందిన ఎరుకల శివకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.33 వేలు మంజూరయ్యాయి. మాడ్గుల మండల కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కును శివకు అందించారు. స్థానిక నాయకులు రాములు, జంగయ్య, నర్సింహా, రమేశ్, రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తవ్వేస్తున్నారు

- మంచాలలో జోరుగా వెలుస్తున్న వెంచర్లు
- మట్టికి పెరిగిన డిమాండ్
- అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్న అక్రమార్కులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


ఆగాపల్లి-కాగజ్‌ఘాట్ గ్రామాల మధ్య కొనసాగుతున్న మట్టి తవ్వకాలు

మంచాల: ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాల్లో మట్టి తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. అక్రమార్కులకు మట్టి వ్యాపారం కాసుల పంట పండిస్తోంది. అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మంచాల మండలంలోని మెజార్టీ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో ఉన్నాయి. గుట్టలు, రాళ్లతో కూడిన పొలాలను తక్కువ ధరలకు కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు వాటిలో ఎలాంటి అనుమతులు లేకుండానే జేసీబీలు, ఇటాచీలు ఉపయోగించి మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. తవ్విన మట్టిని టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. మండలంలోని ఆగాపల్లి, కాగజ్‌ఘాట్, నోముల, లింగంపల్లి గ్రామాల్లో పెద్దఎత్తున కొత్త వెంచర్లు వెలుస్తుండటంతో అక్కడ పెద్ద మొత్తంలో మట్టి అవసరముంటోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో మట్టికి బాగా డిమాండ్ ఏర్పడింది. బోడకొండ, కొర్రంతండా, లోయపల్లి గ్రామాల్లో మట్టిని ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాలతో పాటు సెలవు దినాల్లో మట్టి తవ్వకాలు, తరలింపు ఎక్కువగా నిర్వహిస్తున్నారు.

కొండలనూ వదలని వైనం..

ఇదిలా ఉండగా కాగజ్‌ఘాట్, ఆగాపల్లి, నోముల, ఆరుట్ల, బండలేమూర్, ఎల్లమ్మ తండా, లోయపల్లి గ్రామాల్లోని గుట్టలను జెలిటిక్స్ వంటి పేలుడు పదార్థాలను ఉపయోగించి పగులగొట్టి కంకర, గ్రానైట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. రియల్ వ్యాపారులు గుట్టలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటిని వెంచర్లుగా మార్చే ప్రక్రియలో భాగంగానే ఈ పనులు చేస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, పేలుడు పదార్థాలను ఉపయోగించడం చట్టరీత్యా నేరమని తెలిసినా పట్టించుకోకుండా గుట్టలను తవ్వేస్తున్నారు. మట్టి తరలించే సమయంలో రోడ్ల మీదకు ఒక్కసారిగా టిప్పర్లు పదుల సంఖ్యలో వేగంగా వస్తున్నాయని దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మండలంలో అక్రమ మట్టి తవ్వకాలపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, విక్రయాలు చేపట్టేవారిపై చర్యలు తప్పకుండా తీసుకుంటాం. గ్రామాల్లో ఎక్కడ మట్టి తవ్వకాలు, బ్లాస్టింగ్ వంటివి చేసినా అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా ఎక్కడ మైనింగ్ నిర్వహించినా చర్యలు తీసుకుంటాం.

– కె.అనిత, తహసీల్దార్, మంచాల

కొనసాగుతున్న కంటివెలుగు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో డాక్టర్లు పరిక్షిత్, మంజులాదేవి ఆధ్వర్యంలో 157 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపాతి రజిత, ఎంపీటీసీ నిట్టె మంగమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

386 మందికి..

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్, వెంకటాపూర్ కంటి వెలుగు శిబిరాల్లో బుధవారం 386 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు సైదమ్మ, కల్పన, స్నేహ, రామచంద్రయ్య, మల్లయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

యాచారం: కంటి వెలుగు పథకాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని చింతపట్ల–మొండిగౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో బుధవారం కంటివెలుగు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామ ఉపసర్పంచ్ యాదగిరిరెడ్డి, వార్డుసభ్యులు పాండుయాదవ్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, వైద్య సిబ్బంది అజీమ్, పారిజాత తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ విజయలక్ష్మి మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం గ్రామంలో నర్సరీని సందర్శించి మొక్కల పెంపకంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.


యాచారం: కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ లక్ష్మమ్మ

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన బాలయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5 వేలు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.6 వేలు, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ రూ.3 వేలు సాయం అందించారు.

మృతుడి కుటుంబానికి..

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామానికి చెందిన బెక్కరి సందీప్ (25) మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం పీఏసీఎస్ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ తులసీరాం నాయక్, స్థానిక నాయకులు జవహర్‌లాల్ నాయక్ పరామర్శించారు. సందీప్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి తులసీరాంనాయక్, జవహర్‌లాల్‌నాయక్‌లు సంయుక్తంగా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.

వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారు

చలో రాజ్‌భవన్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేయడమే గాకుండా కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను పంచి పెడుతున్న కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కార్ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ బుధవారం చలో రాజ్‌భవన్ నిరసన ర్యాలీ చేపట్టింది. మండల కేంద్రం నుంచి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, మాజీ ఎంపీటీసీ రాములు, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి అజీం, సేవాదళ్ అధ్యక్షుడు దశరథం, మైనార్టీ అధ్యక్షుడు ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరపాలి..

కడ్తాల్: ఆదానీ కంపనీల్లో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరిపించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం రాజ్‌భవన్ ముట్టడిలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపారవేత్తలకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు.


తలకొండపల్లి: రాజ్‌భవన్‌కు తరలుతున్న నాయకులు

కడ్తాల మండలం నుంచి..

కడ్తాల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాజ్‌భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం మండల కేంద్రం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు తరలివెళ్లారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్,అంజయ్యగుప్త, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, తలకొండపల్లి మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తదితరులు రాజ్‌భవన్ ముట్టడికి తరలివెళ్లారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

అబ్దుల్లాపూర్‌మెట్: బీఎస్పీ వ్యవస్థాపకుడు దివంగత కాన్షీరాం జయంతిని పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం కేంద్రంలో మున్సిపల్ బీఎస్పీ అధ్యక్షుడు యంజాల ప్రహ్లాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార మల్లేశ్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎర్రకార్తీక్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి చిత్రం కృష్ణ, బీఎస్పీ నాయకులు శివ, తరుణ్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి వేడుకలను బుధవారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీఎస్పీ నాయకులు రాజు, గణేశ్, జగన్, శాంత, దాసు, కుమార్, మహేందర్, ప్రసాద్, ప్రేమ్, వెంకట్, రాజేశ్, భరత్, చిరంజీవి, గణేశ్, సుమన్ పాల్గొన్నారు.


అబ్దుల్లాపూర్‌మెట్: కాన్షీరాం జయంతి వేడుకలో బీఎస్పీ నాయకులు

కొంగరకలాన్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతి వేడుకలను ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి దాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు మహేందర్, ఉపాధ్యక్షుడు జనార్ధన్, లింగళ్ల రాజు, సంజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం: కాన్షీరాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నేతలు

వైఎస్సార్ టీపీతోనే సంక్షేమ పాలన

నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి


అర్జున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరిన నాయకులు

ఆమనగల్లు: రాష్ట్రంలో వైఎస్సార్‌టీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమని కల్వకుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌టీపీ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి చెప్పారు. ప్రజలంతా వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలకు అండగా ఉండాలని ఆయన కోరారు. మాడ్గుల మండల కేంద్రంలోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని అంతంపేట గ్రామానికి చెందిన పర్వతాలు, సాయిలు, యాదయ్య, వెంకటయ్య, లింగయ్య, రామస్వామి, యాదయ్య, లాలయ్య, బుచ్చయ్య, జహంగీర్ తదితరులు చీమర్ల అర్జున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందాయని గుర్తుచేశారు. అలాంటి సంక్షేమ పాలన షర్మిలతోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌టీపీని ఆదరించి అధికారంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. సంక్షేమ పాలన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌టీపీఅధ్యక్షుడు శివనాయక్, నాయకులు..ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, శివప్రసాద్, రాజు, శ్రీనివాస్‌గౌడ్, నరేశ్, రవి, గోపాల్, నవీన్, దినేశ్, యాదగిరి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు

యాచారం: పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి తన స్వగ్రామం మొండిగౌరెల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం వెలువడనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో అత్యధిక మోజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు. చెన్నకేశవరెడ్డి గ్రామస్తులను సమన్వయం చేసుకుని రూ.2 కోట్లతో లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ పునఃనిర్మాణం చేపడుతున్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతామన్నారు. పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న చెన్నకేశవరెడ్డి తదితరులు

ఆరోపణలు అవాస్తవం

పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి

మంచాల: మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎలాంటి అవినీతి జరగలేదని ఆ సంఘం చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి అన్నారు. బుధవారం మంచాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం అనైక్యతతోనే నాపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి సంఘం, రైతుల కోసం పనిచేయాలన్నారు. పాలకవర్గం తీర్మానం లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదన్నారు. గత పాలకవర్గాలు చేసిన పాత బకాయిల కారణంగా నేడు రుణాలు రావడం లేదన్నారు. అసత్య ఆరోపణలు మాని సంఘం అభివృద్ధికి అందరూ కలిసిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్లు పద్మ, సత్యనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కమిటీ నియామకం

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలో బుధవారం బాలల సంరక్షణ కమిటీని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ ఆధ్వర్యంలో నియమించారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ.. బాలలతో స్నేహపూర్వకంగా మెలగడంతో పాటు బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, బాలలకు ఏ సమస్య వచ్చిన కమిటీ వెంటనే రియాక్ట్ అవ్వాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. బాలల హక్కులను కాపాడుదామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, పాఠశాల చైర్మన్ భూపాల్, నాయకులు భీష్మాచారి, జంగమ్మ, శ్రీలత, షబ్బీర్, ఉపాధ్యాయురాలు విజితారెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

జీవన ఎరువుతో అధిక దిగుబడులు

మండల వ్యవసాయాధికారి అరుణకుమారి

ఆమనగల్లు: రైతులు తమ పంటల్లో భాస్వరం కరిగించే జీవన ఎరువులను వాడటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. ఆమనగల్లు మండల పరిధిలోని పులుగోనిపల్లితాండా, సీతారాంనగర్‌తాండా, ఆకుతోటపల్లి, గౌరారం గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. జీవన ఎరువులు వాడటం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తక్కువ అవుతుందని, అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల పంటలకు చీడపీడలు ఎక్కువగా వస్తాయని, సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేస్తే చీడపీడలు తక్కువగా ఉంటాయని, అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం, రైతులు రత్న, హేమ్లా, దేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు: వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ అరుణకుమారి

వరిపంట పరిశీలన

తలకొండపల్లి: వరి పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎడవల్లిలో వరి పంటలను ఆయన పరిశీలించారు. వరిలో ఎండకు తెగులు ఎక్కువగా వ్యాప్తి చెందుతుందన్నారు. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనాథ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలకు చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనకు చెందిన కొంగర యాదయ్య, రావిశెట్టి చిన్నసాయిలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. వీరిరువురు ఇటీవల నూతన ఇండ్ల నిర్మాణాలను చేపట్టారు. డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణాలను నిలిపివేశారు. స్థానిక నాయకుడు, ఉప సర్పంచ్ సుధాకర్ సహకారంతో జెడ్పీటీసీని కలుసుకొని ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. తక్షణమే స్పందించిన జెడ్పీటీసీ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందచేస్తానని భరోసా పలికారు. బుధవారం ట్రస్టు సభ్యులచే ఇంటి నిర్మాణాలకు ఇసుక, సిమెంట్, ఇటుక, స్టీల్, తదితర మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, రాజేందర్ రెడ్డి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం పరిశీలన..

కడ్తాల్: మండల పరిధిలోని ముద్వీన్‌లో ఇల్లు లేని నిరుపేద మహిళా కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గృహ నిర్మాణాన్ని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ బుధవారం పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తిచేయాలని నిర్మాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచ్ యాదయ్య స్థానిక నాయకులు ఉన్నారు.

మొదటి రోజు ప్రశాంతం

ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదటిరోజు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమైనాయి. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఈ పరీక్షలు జరిగాయి. అరగంట ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతినిచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


ఆమనగల్లు: పరీక్ష రాస్తున్న విద్యార్థులు


ఇబ్రహీంపట్నం: పరీక్షా హాల్ వద్ద హాల్‌టికెట్ వివరాలు చెక్ చేసుకుంటున్న విద్యార్థులు


ఆమనగల్లు: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


ఇబ్రహీంపట్నం: హాల్‌టికెట్లు తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి

తుర్కయంజాల్: టీఎస్‌పీఎస్‌సీ పరీక్షల పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, కార్యదర్శి బి.శంకర్ అన్నారు. పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులు ఇలాంటి చర్యలతో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. బోర్డు చైర్మన్ జనార్దన్‌రెడ్డితో పాటు బోర్డు సభ్యుల పాత్రపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధు, కమిటీ సభ్యులు విప్లవ్, శ్రీకాంత్, స్టాలిన్, తరంగ్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రోత్సాహం

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: కులవృత్తులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో కుమ్మరులు తయారు చేస్తున్న కుండలను వారు పరిశీలించారు. కుమ్మరి సారేను కట్టెతో తిప్పాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, దానికి అవసరమయ్యే యంత్రాలను సమకూర్చాలని కుమ్మరులు వారి దృష్టికి తెచ్చారు. బీసీ ఫైనాన్స్ కార్పోరేసన్ ద్వారా త్వరలో ఎలక్ట్రానిక్ సారేలు అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి కార్మికులు నర్సింహ, రాములు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, సర్పంచ్ యాదయ్య, భారతమ్మ, నర్సింహగౌడ్, ఉప సర్పంచ్ వినోద్, నాయకులు ఉన్నారు.


కుండల తయారీని పరిశీలిస్తున్న వెంకటేశ్‌గుప్తా